సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: పట్టణంలోని దాదాపు అన్ని వార్డుల్లో సీసీ రహదారులను ఏర్పాటు చేసుకున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. ఇంకా ఆయా వార్డుల్లో మిగిలిపోయిన చోట కూడా సీసీ రహదారులు వేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పట్టణంలోని 24 వార్డులో కౌన్సిలర్ కొనమొల్ల భారతమ్మతో కలిసి ఆమె సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కొనమొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గొడవపై పోలీసుల కౌన్సిలింగ్

మైలార్‌దేవ్‌పల్లి: మహావీర్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థి, రెండవ సంవత్సరం విద్యార్థుల మధ్య గొడవ జరిగిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు రోజుల క్రితం కాలేజీలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థి క్లాస్ రూంలోకి వెళ్లి గట్టిగా సెమినార్ ఉందని, అటెండ్ కావాలని అందరిని పిలిచాడు. దీంతో అక్కడే ఉన్న సీనియర్లు ఎందుకు అరుస్తున్నావని విద్యార్థిని అడిగారు. దీంతో మొదటి సంవత్సరం విద్యార్థి దురుసుగా సమాధానం ఇచ్చాడు. బాత్‌రూమ్ దగ్గర కనిపించిన మొదటి సంవత్సరం విద్యార్థి పై సీనియర్లు చేయిచేసుకున్నారు. దీంతో ఆ విద్యార్థి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో ఎవరైన జూనియర్లను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

బస్తీల్లో ప్రజలకు సూచనలు చేసిన కమిషనర్



పారిశుద్ధ్య సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు

శంషాబాద్: ఫ్రైడే డ్రైడేలో భాగంగా పట్టణంలోని వివిధ బస్తీల్లో మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు పర్యటించి పరిశీలించారు. ఇళ్ల ఆవరణలో వినియోగించకుండా ఉండే నీటి నిల్వలను తొలగించాల్సిందిగా ఆయన సూచించారు. కూలర్లు, కొబ్బరి చిప్పలు, టైర్లు, ఇంటి పై కప్పులు ఇతర ప్రాంతాల్లో నిలిచిపోయిన నీటి ద్వారా వచ్చే దోమలతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని ప్రజలకు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ అనిల్ , పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్ధమాన్‌లో అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ప్రారంభం



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధ్యాపకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని కాచారం శివారులో ఉన్న వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆరవ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ అడ్వాన్సెస్ ఇన్ మెకానికల్ సైన్సెస్ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో దేశ, విదేశాల నుంచి వివిధ విభాగాల్లో 80 పరిశోధనా పత్రాలను సమర్పించారు. పరిశోధన ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి చేరుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీఆర్ రవీంద్ర ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ గౌహతి సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్‌కుమార్ భట్టాచార్య, కాన్ఫరెన్స్ కన్వీనర్ బి.వెంకటేష్, డా.రాజేష్‌రవి, డా.సౌమిత్ భౌమిక్, డా.సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకంబరి పూజలు





మణికొండ: ఆషాఢమాసంలో భాగంగా రాజరాజేశ్వరీ అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ, మైహోం అవతార్ గేటెడ్ కమ్యూనిటీ సమీపంలోని శ్రీ సంకటహర హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఉన్న ఓంకారేశ్వర సహిత రాజరాజేశ్వరీ అమ్మవారికి మహిళలు అభిషేకం చేశారు. అనంతరం శాకంబరిగా అలంకరించి, కుంకుమార్చన, సహస్ర నామార్చనలో పాల్గొన్నారు. ఆషాఢమాసంలో అమ్మవార్లను కొలిస్తే అనారోగ్యాలు కలగకుండా ఆరోగ్యంగా ఉంటామని పూజారి సీతాపతి పేర్కొన్నారు.

భారత క్రీడాకారులకు 'మనూ' శుభాకాంక్షలు



రాయదుర్గం: పారిస్ ఒలంపిక్స్–24లో భారత్ భారీగా పతకాలను సాధించాలని మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ ఆకాంక్షించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం వద్ద భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీఎస్‌సీ చైర్మన్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏ కలీముల్లా, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ జే రాజేష్, డాక్టర్ మహ్మద్ హబీబుల్లా, అసిస్టెంట్ ఇంజనీర్ ఎంఏ హఫీజ్ పాల్గొన్నారు.

బోనం..సంబరం

అమ్మవారిని దర్శించుకున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు





డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆహ్వానిస్తున్న మాజీ చైర్మన్ వెంకటేష్



భక్తులతో రద్దీగా మారిన లాల్‌దర్వాజా ఆలయం

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని శుక్రవారం ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చలు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో పరిసరాలు సందడిగా మారాయి. మహిళలు, విద్యార్థినులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. – అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



అమ్మవారికి చేనేత పట్టుచీరను తీసుకొస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని



బోనాల ఉత్సవాల్లో నాగార్జున హైస్కూల్ విద్యార్థులు



లాల్‌దర్వాజా అమ్మవారి పూజలు చేస్తున్న గోల్కొండ మహంకాళి ఆలయ పూజారి సురేష్‌చారి తదితరులు



ఆలయం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న డీసీపీ స్నేహ మెహ్రా

సన్మానం



శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న రాంనాథ్

శంషాబాద్ రూరల్: మండలంలోని ఘాంసిమియాగూడ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శుక్రవారం పంచాయతీ పాలకవర్గం మాజీ సభ్యులు, శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం చైర్మన్ రాంనాథ్ ఆయనను సన్మానించారు. గత 8 ఏళ్లుగా ఆయన అందించిన సేవలను కొనియాడారు.

ఆలయంలో ఆడపడుచు గోరింటాకు సంబరాలు



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండ్లగూడ పాత గ్రామంలో ఆడపడుచుల గోరింటాకు సంబరాలు శుక్రవారం నిర్వహించుకున్నారు. శ్రీ బుజలి మహంకాళీ అమ్మవారి ఆలయంలో గోరింటాకు సంబరాల నేపథ్యంలో మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ మహిళలతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆషాఢమాసం బోనాల ఉత్సవాలను మహిళలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ నెల 28న ఆదివారం కార్పొరేషన్ పరిధిలో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోరింటాకు పెట్టుకోవటం ఆనవాయితీ

మణికొండ: ఆషాఢమాసంలో అమ్మవార్లకు బోనాలు, పూజలతో పాటు మహిళలంతా గోరింటాకు పెట్టుకోవటం ఆనవాయితీగా వస్తుందని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షురాలు రూపారెడ్డి అన్నారు. శుక్రవారం మణికొండలో పార్టీ ఆధ్వర్యంలో మెహందీ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి మహిళ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవాలని, మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తిలతాగౌడ్, మహిళలు సుమ, నళిని, సంధ్య, అన్ను, అనూష, బిందు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



గోరింటాకు ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

శిక్షా సప్తహో..

అత్తాపూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను అందించడంతో విద్యార్థులు ప్రయోజకులు అవుతారని అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన మేరకు తెలంగాణ రాష్ట్రంలో అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తహో విద్యార్థులను భాగస్వాములను చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కంప్యూటరీకరణ నేపథ్యంలో భవిష్యతరాలలో పుస్తకాల మోత ఉండదని తెలిపారు. విద్యార్థుల స్కిల్ డెవలప్‌మెంట్‌పై గతంలో రవీంద్ర భారతీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మట్టి పాత్రలు తయారు చేసి ఉన్నతాధికారుల చేత మన్ననలు పొందిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షా సప్తహో కార్యక్రమం

బ్లూక్రాస్ కేంద్రాల పరిశీలన

మణికొండ: బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వీధి కుక్కల జనన నియంత్రణపై మున్సిపల్ కమిషనర్‌లు, చైర్‌పర్సన్‌లకు అవగాహన కల్పించారు. శుక్రవారం నగరంలో పలు చోట్ల నిర్వహిస్తున్న కేంద్రాలకు సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్ ఆధ్వర్యంలో కుక్కల నియంత్రణ, వాటి సంఖ్య తగ్గటానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాంటి వ్యవస్థను ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసుకుంటే వాటి బెడదను ప్రజలకు నివారించవచ్చని సంస్థ నిర్వాహకురాలు, సినీనటి అమల వివరించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్‌లతో పాటు పలు మున్సిపాలిటీల చైర్మన్‌లు, కమిషనర్‌లు పాల్గొన్నారు.



వీధికుక్కల నియంత్రణను వివరించిన సినీనటి అమల

పద్మశాలిపురంలో పర్యటించిన కార్పొరేటర్

మైలార్‌దేవ్‌పల్లి: బోనాల ఉత్సవాలలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం మహంకాలి దేవాలయ సమీపంలో మురుగు నీరు రోడ్ల పై ప్రవహిస్తుండడంతో స్థానికులు విజ్ఞప్తి మేరకు అక్కడి వచ్చి పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఏఇ నరసింహమూర్తి, వర్క్ఇన్‌స్పెక్టర్ రాహుల్, స్థానికులు బుచ్చిరెడ్డి, ఎస్ఎం రెడ్డి, ఎల్విరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పర్యటించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

టెబుల్ టెన్నిస్ అండర్ 11-19 టోర్నమెంట్

మైలార్‌దేవ్‌పల్లి: మహావీర్ గ్రూపు విద్యాసంస్థలు, మహావీర్ విద్యాసొసైటీ సౌజన్యంతో కళాశాలలోని ఇండోర్‌హాల్‌లో స్వర్గీయ సంరెడ్డి సుదర్శన్ రెడ్డి స్మారక రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. 2024 జూలై 27 నుంచి 29 వరకు నిర్వహించబడునని కళాశాల కార్యనిర్వాహక కార్యదర్శి టోర్నమెంట్ కమిటీ, మహావీర్ గ్రూపు సంస్థల సెక్రెటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ టోర్నమెంటులో బాలురు, బాలికల విభాగంకు చెందిన అండర్ 11–19 విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

ట్యాక్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలి

ఫాస్ట్ బిజినెస్ కన్సల్టింగ్ సీఈఓ మిథిలేష్ సాయిసన్నారెడ్డి

రాయదుర్గం: ట్యాక్స్‌కు సంబంధించిన అంశాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఫాస్ట్ బిజినెస్ కన్సల్టింగ్ సీఈఓ, ఆర్థిక నిపుణుడు మిథిలేష్ సాయిసన్నారెడ్డి సూచించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో శుక్రవారం ప్రముఖ కంపెనీల చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రంగంలోకి వచ్చే కొత్త సీఏలు ట్యాక్స్‌కు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవడం ద్వారా తమ క్లయింట్లకు సరైన సేవలు అందించగలుగుతారన్నారు.

వైద్య విద్యలో ఉజ్బెకిస్తాన్‌కు మంచి గుర్తింపు



గచ్చిబౌలి: వైద్య విద్య అందించడంలో ఉజ్బెకిస్తాన్‌కు మంచి గుర్తింపు ఉందని ఆ దేశంలోని టురోన్ జర్మన్ యూనివర్సిటీ చైర్మన్ దిల్షాన్ షుకూర్ అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంబీబీఎస్ ప్రవేశాల వివరాలను వెల్లడించారు. అపోలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అనుబంధ సంస్థ అపోలో మేడ్ స్కిల్ లిమిటెడ్‌లో శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీని అందిస్తుందన్నారు. ఉజ్బెకిస్తాన్ యూనివర్సిటీలో నేరుగా ప్రవేశం పొందవచ్చున్నారు. కార్యక్రమంలో అపోలో మేడ్ స్కిల్ లిమిటెడ్ సీఈఓ శ్రీనివాసరావు పాలిజల, గ్యాంటేజ్ గ్రూపు చైర్మన్ గజన్ ఫర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1982–83 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులు శుక్రవారం హై స్కూల్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి అప్పటి తెలుగు పండితులు జంగయ్యతో పాటు 48 మంది హాజరయ్యారు. 1982–83 బ్యాచ్ ప్రెసిడెంట్ ఎం.కృష్ణారావు, సామ సురేందర్ రెడ్డి, ట్రెజరర్ అక్కిరాజు, సుబ్బారావు, అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ప్రెసిడెంట్ ఎం.కృష్ణారావు మాట్లాడుతూ... గతంలో కూడా మా బ్యాచ్ వారి ఆర్థిక సహాయంతో పేద విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు అందజేయడం జరిగిందన్నారు. స్కూల్ భవనాలకు కావాల్సిన మరమ్మతులు కూడా చేయించామన్నారు. మేము పిలిచిన వెంటనే మా ఆహ్వానాన్ని మన్నించి ఈ కార్యక్రమానికి హాజరైన గురువర్యులు, తెలుగు పండితులైన జంగయ్యను ఘనంగా సత్కరించామని తెలిపారు.

సరిపడా నీరు సరఫరా చేయాలి

రాయదుర్గం: తాగునీటి సరఫరాపై గోపన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో తగినంత నీరు సరఫరా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏఈకి ఫోన్ చేస్తే మీ కాలనీ కోటా వదులుతున్నామని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐటీ కారిడార్‌లో రోడ్లను అద్దంలా తీర్చిదిద్దాలి

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



ఇంజనీరింగ్, యూబీడీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: చెత్త కుప్పలు, వ్యర్థాలతో ముక్కు మూసుకునే పరిస్థితి రానివ్వమని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలి ప్రధాన రహదారి, శిల్పాస్టే ఓవర్‌పై పారిశుద్ధ్యం పనులను ఆయన కాలినడకన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లను శుభ్రం చేసిన అనంతరం వెంటనే చెత్త కుప్పలను తొలగించాలని సూచించారు. ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, కూడళ్లలో మట్టి, ఇసుకను ఏరోజుకారోజు తొలగించాలన్నారు. డీసీ నుంచి కింది స్థాయి అధికారుల వరకు పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షించాలన్నారు. లోటుపాట్లను సవరించుకుంటూ ఐటీ కారిడార్‌లోని రోడ్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీ రజనీకాంత్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

శేరిలింగంపల్లి జోన్ పరిధిలో రహదారులపై వరద నీరు నిల్వ ఉండకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో ఇంజనీరింగ్, యూబీడీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ లాగింగ్ పాయింట్లతో పాటు ట్రాఫిక్ అంతరాయంగా పాత్ హోల్స్‌ను వెంటనే పూడ్చాలని, గుంతలు పూడ్చకుంటే సంబంధిత అధికారులే బాధ్యులవుతారని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియంలో , కూడళ్లలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని, చెట్ల సంరక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని యూబీడీ అధికారులను ఆదేశించారు. చెరువులలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ ఎస్ఈ శంకర్, ఈఈలు, డీఈలు, యూబీడీ అధికారులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

రాజేంద్రనగర్: ఆషాఢమాసం బోనాల జాతర పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అమ్మవారి దేవాలయాలు ముస్తాబయ్యాయి. దేవాలయాలతో పాటు బస్తీలు, ప్రధాన రహదారులను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం అమ్మవారి ఘటాలు, తొట్టెల ఊరేగింపుతో పాటు సామూహిక బోనాల ఊరేగింపులు ఉండటంతో తగు ఏర్పాట్లు చేపడుతున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



విద్యుత్‌దీపాలతో స్వాగత తోరణం



ముస్తాబైన శ్రీ మాత పోచమ్మ దేవాలయం



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు